# శీలసంపత్తిని పోషించని విద్య నిరర్థకం

**శాంతి అంతరించె సత్యంబు కరువయ్యె**
**ఆయుధముల ప్రీతి అధికమయ్యె**
**ఆయుధముల భీతి అధికమయ్యె**
**ఈ దురంతములకు హేతువు స్వార్థమే**
**ఉన్నమాట తెలుపుచున్న మాట**

***ప్రేమస్వరూపులారా!*** దినదినమునకు విద్య అభివృద్ధి గాంచుచున్నది గాని, విద్యయొక్క ప్రభావమైన మంచినడత ఎక్కడా కనిపించడం లేదు. అసలు ఎట్టి విద్యను మనము అభ్యసించాలి? ఈనాటి విద్యార్థులు నేర్చే విద్యలన్నీ లౌకికమైనవి. వీటికి ఆధ్యాత్మికతత్త్వాన్ని జోడించాలి. ప్రేమతత్త్వాన్ని అభివృద్ధిపరచుకోవాలి, సత్యమార్గాన్ని అవలంబించాలి. సత్య, ప్రేమలతో కూడిన విద్యయే నిజమైన విద్య. అవి లేని విద్యకు విలువ లేదు. భౌతికవిద్యలు జీవనోపాధి నిమిత్తం ఏర్పడినవి. ఆధ్యాత్మికవిద్య జీవితపరమావధికిసంబంధించినది. ఈ రెండింటినీ సమన్వయపరచడమే విద్యార్థుల కర్తవ్యము. ఈ రెండింటియొక్క ప్రాముఖ్యతను ఈనాడు ప్రపంచము గుర్తించింది.

ఈనాడు ప్రపంచంలో అనేకమంది ఆధ్యాత్మికతత్త్వాన్ని ప్రబోధిస్తున్నారు. ఆధ్యాత్మికము ప్రచారప్రబోధలలో అగ్రస్థానములో ఉన్నదిగాని, ఆచరణలో మాత్రం దిగజారిపోయింది. హృదయపూర్వకమైన ఆచరణ అత్యవసరము. ఆచరణలో లేని విద్యలే అశాంతికి మూలకారణం. ఆధునిక విద్యను 'ఎడ్యుకేషన్' అన్నారు. ఆధ్యాత్మిక విద్యను 'ఎడ్యుకేర్' అన్నారు. 'ఎడ్యుకేర్' అనగా మానవుని యందున్న మానవతా విలువలను వెలికితీసి ప్రపంచానికి ఆదర్శము నందించడం. 'ఎడ్యుకేషన్' అనేది గ్రంథపరిచయానికి పరిమితమై

srisathyasaivachanamrutam

యున్నది. కాని, 'ఎడ్యుకేర్' అనేది గ్రంథములకు సంబంధించినది కాదు. అది హృదయగ్రంథికి సంబంధించినది; హృదయపూర్వకమైన ప్రేమ, సత్యము, ధర్మము ఇత్యాది గుణములను ప్రబోధిస్తుంది. ఈ రెండింటియొక్క సమ్మిళితమైన విద్యయే జగత్తుకు ఆదర్శముగా నిలుస్తుంది. ఒకటి అంతర్ముఖమైన ప్రబోధ, రెండవది బహిర్ముఖమైన ప్రబోధ. బహిర్ముఖమైన ప్రబోధలు 'నెగెటివ్' తత్త్వానికి సంబంధించినవి. అంతర్ముఖమైన ప్రబోధలు ప్రేమ అనే 'పాజిటివ్' తత్త్వానికి సంబంధించినవి. ప్రేమకొక రూపం లేదు. తోటివారిని ప్రేమించి, వారి ప్రేమను గైకొని ప్రేమద్వారా ఆనందమును అనుభవించాలి. ఇలాంటి అంతర్ముఖమైన ప్రబోధలు మానవునికి అత్యవసరం. మనిషికి, మనిషికి మధ్య సన్నిహిత సంబంధ బాంధవ్యమును కల్పించేదే 'ఎడ్యుకేర్'. కాని, ఈనాడు అట్టి సన్నిహిత సంబంధ బాంధవ్యము క్షీణించిపోయింది. ఒకరి మనస్సులో ఏమున్నదో ఇంకొకరికి తెలియదు. మనస్సులో ఉన్నది నోటితో చెప్పరు. నోటితో చెప్పింది క్రియలో చూపించరు. ఇది నిజమైన విద్యావంతుల లక్షణం కానేరదు. The proper study of mankind is man. అదే నిజమైన విద్య. హృదయములో పుట్టిన భావమును నోటితో పలికి, చేతితో ఆచరించి ప్రపంచానికి ఆదర్శము నందించాలి.

**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్**
**మనస్సన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్.**

మానవుడు మహాత్మునిగా తయారుకావలసింది పోయి దురాత్మునిగా తయారౌతున్నాడు. ఏ చదువులూ ఎరుగని పల్లెప్రజలు మాత్రం ఎంతో మర్యాదగా, ఆదర్శవంతంగా జీవితాన్ని గడుపుతున్నారుగాని, చదువుకున్న వారే మహాదొంగలుగా మారిపోతున్నారు.

**ఆధునికవిద్య - విద్యార్థులపై దాని ప్రభావం**

ఈనాడు దేశానికి ఎక్కువగా అపకారం చేస్తున్నవారు విద్యావంతులే! చదువుసంధ్యలు ఎంత నేర్చినప్పటికీ నిజమైన జ్ఞానతత్త్వమును అనుభవించాలంటే ఆత్మభావమును అభివృద్ధి చేసుకోవాలి. ఈనాడు విద్యావంతులని, గొప్ప తెలివితేటలు గలవారని పేరొందిన వారు పట్టణాల్లో నివసిస్తున్నారు. ఎట్టి విద్యలూ ఎరుగని పామరులు పల్లెల్లో జీవిస్తున్నారు.

sri sathyasai vahini

అయితే, పట్టణాల్లో నివసించే విద్యావంతుల కంటే పల్లెల్లో నివసించే పామరులే ఎంతో ఆనందంగా జీవిస్తున్నారు. పట్టణాల్లో యూనివర్సిటీ లున్నాయి, ఎన్నో కాలేజీలున్నాయి, ఎన్నో హైస్కూళ్ళున్నాయి. కాని, ఎక్కడాలేని అల్లర్లుకూడా పట్టణాల్లోనే జరుగుతున్నాయి. ఇదంతా ఆధునిక విద్యయొక్క దుష్ప్రభావమే! ఒకతూరి పల్లెలకు పోయి పరీక్షించండి. "ఎవరండీ మీరు? ఎక్కడినుండి వచ్చారు?" అంటూ పల్లె ప్రజలు ఎంతో గౌరవంగా మిమ్మల్ని పలుకరిస్తారు. కాని, పట్టణాల్లో నివసించే వ్యక్తులు తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములు వచ్చినా, "ఏమిటి, ఎట్లా ఉన్నారు?" అని కుశలప్రశ్నలు వేయరు. ఒకరికొకరి మధ్య సన్నిహిత సంబంధ బాంధవ్యమే క్షీణించిపోయింది. దీనికి కారణం ఆధునిక విద్యయే!

The end of education is character. శీలనిర్మాణమే విద్యకు పరమావధి. కాని, ఈనాటి విద్యార్థులు శీలసంపత్తిని కోల్పోతున్నారు. అందువల్లనే వాళ్ళలో పెద్దలపట్ల గౌరవమర్యాదలు క్షీణించిపోయాయి. పిల్లలను ఏవో గొప్ప చదువులు చదివించాలనే ఆశతో తల్లిదండ్రులు వాళ్ళను పట్టణాలకు పంపిస్తున్నారు. తల్లిదండ్రుల ఉద్దేశ్యము మంచిదే! కాని, పిల్లలు పట్టణాలకు వెళ్ళి పెడమార్గంలో ప్రవేశిస్తున్నారనే విషయాన్ని వాళ్ళు గుర్తించుకోలేక పోతున్నారు. పల్లెల్లో ఉన్నంతకాలం పిల్లలు పెద్దలపట్ల ఎంతో వినయవిధేయతలతో, గౌరవమర్యాదలతో ప్రవర్తిస్తారు. ఒకవేళ పిల్లలేదైనా తప్పుచేసినా వాళ్ళను మందలించి సరిదిద్దడానికి తల్లిదండ్రులు దగ్గరే ఉంటారు. కాని, పట్టణాల్లో పెడమార్గం పట్టే పిల్లలను దండించేవారే లేరు. సినిమాలకు పోవడం, పొగత్రాగడంలాంటి దురభ్యాసములను ప్రోత్సహించేవారే అధికంగా ఉన్నారు. దీనికి మూలకారణం ఆధునికవిద్యయే! పట్టణాలకు వెళ్ళేసరికి పిల్లలు వినయవిధేయతలను పూర్తిగా కోల్పోతున్నారు. కొంతమంది పిల్లలు తండ్రి ఎదురుగా వస్తున్నా లెక్కచేయకుండా సిగరెట్టు కాలుస్తారు. "ఇది నా ఇష్టము. నా సిగరెట్టు నేను కాలుస్తాను. ఇంకొకరికి నేనెందుకు భయ పడాలి?" అంటారు ఆధునిక విద్యార్థులు.

ఒకానొక సమయంలో ఒక విదేశీయుడు, ఒక ఆధునిక విద్యార్థి రైలులో ఒకే కంపార్టుమెంటులో ప్రయాణిస్తున్నారు. ఆ విద్యార్థి పొగత్రాగుతూ విదేశీయునిపై 'ఉఫ్'

sri sathyasai vachanamrutam

అంటూ ఊదుతున్నాడు. ఆ విదేశీయుడు, "నాయనా! నాకు ఆరోగ్యం సరిగా లేదు. ఈ పొగ నాకు పడదు. నీకు పొగ త్రాగాలనిపిస్తే బాత్‌రూమ్‌కి వెళ్ళి త్రాగు", అని చెప్పాడు. అందుకా విద్యార్థి, "ఇది నా ఇష్టము. ఈ సిగరెట్టు నాది. నేను కొన్నాను. కాబట్టి, నా ఇష్టమొచ్చినట్లు కాలుస్తాను, పొగ వదులుతాను. నీకిష్టం లేకపోతే నీవే బాత్‌రూమ్‌కి వెళ్ళి కూర్చో", అని దురుసుగా సమాధానమిచ్చాడు. ఆధునిక విద్యార్థులు ఈవిధంగా ఉంటారా, అని అతను ఆశ్చర్యపోయాడు. ఆ పిల్లవానితో వాదించడం ఇష్టం లేక మౌనం వహించాడు. కొద్దిసేపటికి విదేశీయుడు లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. అతను తిరిగి వచ్చేలోపల ఆ విద్యార్థి అతని బూట్లను రైలు బయటకు విసిరేశాడు. ఆ దృశ్యం అతని కంట పడింది. కాని, వానితో పోట్లాడడం మంచిది కాదని భావించి అతను తన బెడ్‌మీద పడుకున్నాడు. కొంతసేపైన తరువాత ఆ విద్యార్థి లేచి బాత్‌రూమ్‌కి వెళ్ళాడు. అప్పుడా విదేశీయుడు వానికి గుణపాఠం నేర్పాలనే ఉద్దేశంతో అక్కడ తగిలించబడి ఉన్న వాని కోటును తీసి బయటికి విసిరేశాడు. వాడు తిరిగి వచ్చి, "నా కోటు ఎక్కడ?" అని అడుగగా, "నీ కోటు నా బూట్లను వెతకడానికి వెళ్ళింది", అని జవాబిచ్చాడు.

**విద్యయొసగును వినయంబు...**

మనం ఏది చెప్పినా, ఏది చేసినా వాటి 'రియాక్షన్, రీసౌండ్, రిఫ్లెక్షన్'లను అనుభవించక తప్పదు. మనం పవిత్రమైన పదముల నుపయోగపెట్టినప్పుడు ఇతరులనుండికూడా పవిత్రమైన పదములనే అందుకుంటాము. మనం కఠినమైన మాటలనుపయోగపెడితే ఇతరుల నుండి కఠినమైన మాటలనే స్వీకరించవలసివస్తుంది. కాబట్టి, ఎవరైనా సరే, మృదుమధురమైన భాషను ఉపయోగించాలి. విద్యావంతుడైనా, విద్యావిహీనుడైనా వినయవిధేయతలతో ప్రవర్తించాలి.

*విద్యయొసగును వినయంబు, వినయమునను*
*బడయు పాత్రత, పాత్రతవలన ధనము,*
*ధనమువలనను ధర్మంబు, దానివలన*
*ఐహికాముష్మిక సుఖంబులందు నరుడు*
*సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి,*

sri sathyasai vachanamrutam

*భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనంబు*
*నేర్పునదె విద్య విద్యార్థి నేర్వవలయు*
*సత్యమును తెల్పుమాట శ్రీసాయిమాట*

కాని, ఈనాటి విద్యార్థులు తమ కర్తవ్యాన్ని విస్మరించి, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారు. గొప్ప చదువు చదివి నీచంగా ప్రవర్తిస్తే ఏమి ప్రయోజనం? గొప్పచదువుతోపాటు గొప్ప ప్రవర్తన కూడా ఉండాలి. నిరాడంబరమైన జీవితాన్ని గడపాలి. ఇదే నిజమైన విద్యావంతుల లక్షణం. ఒకానొక సమయంలో గాంధీజీ తన చేతిలో ఒక పుస్తకమును పట్టుకొని కంటిధారలు కారుస్తున్నారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన ఒక ఆంగ్లేయుడు, "గాంధీజీ! మీ దుఃఖానికి కారణమేమిటి?" అని అడిగాడు. అప్పుడు గాంధీజీ, "నాయనా! ఆధునిక విద్య విద్యార్థులలో శీలసంపత్తిని పోషించడం లేదు. హృదయాన్ని కఠినంగా మార్చివేస్తున్నది. ఇలాంటి విద్యవలన నా దేశము ఎన్ని కష్టాలకు గురి కావలసివస్తుందో అని నాకు దుఃఖంగా ఉన్నది", అని చెప్పారు

విద్యార్థులారా! ప్రాచీన కాలానికి, ఆధునికయుగానికి చాలా వ్యత్యాసం గోచరిస్తున్నది. ఈ ఆధునికయుగానికి తగినట్లుగా ప్రవర్తిస్తున్నామని కొందరంటారు. ఈ యుగము ఆధునికమైనది కావచ్చుగాని, మీ ప్రవర్తన ప్రాచీనసంస్కృతిని అనుసరించి ఉండాలి. అప్పుడే మీ చదువుకు తగిన గౌరవం వస్తుంది. మీ తల్లిదండ్రులను గౌరవించాలి. పెద్దలెవరైనా మీ ఇంటికి వస్తే వినయవిధేయతలతో వారిని ఆదరించాలి. వారితో మృదుమధురంగా సంభాషించాలి. మీ ప్రవర్తనద్వారా తల్లిదండ్రుల గౌరవాన్ని కాపాడాలి. వినయ విధేయతలు లేనివాడు student (విద్యార్థి) కాజాలడు, వాడొక stupid (అవివేకి) అనే చెప్పవచ్చును. విద్యార్థులున్న ప్రదేశంలో అలజడికి, అల్లర్లకు తావులేకుండా వాతావరణం ప్రశాంతంగా ఉండాలి. కాని, ఈనాడు విద్యార్థులున్నచోటికి వెళ్లాలంటేనే పెద్దలు భయపడతారు. కారణమేమిటి? వాళ్ళు ఏమి అల్లరి చేస్తారో యేమోనని భయం! పూర్వం విద్యార్థులు వినయ, వివేకములతో వర్తించేవారు. కాని, ఈనాటి విద్యార్థుల పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నది. దీనికి ఆధునికవిద్యయే మూలకారణం. నీతినిజాయతీలు, భక్తి

sri sathyasai vachanamrutam

ప్రపత్తులను పోషించని విద్యవలన దేశానికి కలిగే ఉపకార మేమీలేదు. పూర్వకాలంలో తల్లిదండ్రులు పిల్లలకు అక్షరాభ్యాసం చేయించే సమయంలో పెద్దలను ఆహ్వానించి, వారిచేత అక్షతలు వేయించి, పిల్లలు మంచి విద్యావంతు లయ్యేటట్లు ఆశీర్వదించ వలసిందిగా కోరేవారు. "ఓం నమః శివాయ", "ఓం నమో నారాయణాయ", అనే పవిత్రమైన దైవప్రార్థనలచేత అక్షరాభ్యాసమును ప్రారంభించేవారు. కాని, ఈనాటి పిల్లలు మొట్టమొదట నేర్చుకునే దేమిటి? Ba..... Ba..... Black sheep... ఇలాంటి చదువులు చదవడంవలన పిల్లలుకూడా Black sheep (గొఱ్ఱెలు)గా తయారౌతున్నారు.

**మానవతాగుణములను కాపాడుకోవాలి**

విద్యార్థులారా! మీరిక్కడ పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణంలో పెరుగుతున్నారు. దీనిని మీరు అభ్యసించి అభివృద్ధిపరచుకుంటూ రావాలి. Educare (ఎడ్యుకేర్) అంటే ఏమిటి? మన లోపల ఉన్న మానవతా గుణములను బయటికి తీయాలి. వాటిని careful (జాగ్రత్త)గా కాపాడుకోవాలి. మీ మాటలను, తలంపులను, నడతను మరియు మీ హృదయాన్ని జాగ్రత్తగా watch (పరిశీలన) చేయాలి. 'నేను పవిత్రమైన పదముల నుపయోగిస్తున్నానా? లేక, అపవిత్రమైన పదముల నుపయోగిస్తున్నానా?' అని watch చేయాలి. 'నేను ధర్మబద్ధమైన పనిచేస్తున్నానా? లేక, ధర్మవిరుద్ధమైన పనిచేస్తున్నానా?' అని watch చేయాలి. ఈ watch అనే పదముయొక్క అంతరార్థమును నేను పిల్లలకు తరచుగా చెబుతుంటాను –

W - Watch your words
A - Watch your actions
T - Watch your thoughts
C - Watch your character
H - Watch your heart

మీ wristwatch (చేతిగడియారం) ఎప్పుడైనా చెడిపోవడానికి అవకాశముందిగాని, ఈ WATCH ఏనాటికీ చెడిపోదు. ఇది ఎప్పటికీ పవిత్రతనే అందిస్తుంది. మన ప్రాచీనవిద్య ఇలాంటి దివ్యమైన ప్రబోధలతో మనిషిని ఆదర్శప్రాయునిగా తీర్చిదిద్దుతూ వచ్చింది.

sri sathyasai vahini amrutam

ఇలాంటి ప్రబోధలు ఈనాడు అడుగునపడిపోయాయి.

**పవిత్రత, పరిశుభ్రత అత్యవసరం**

విద్యార్థులారా! అంతశ్శుద్ధితోపాటు బాహ్యపరిశుభ్రత కూడా అత్యవసరం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కొంతమంది రోడ్డు మీద ఉమ్మివేస్తుంటారు. అలాంటివారివద్దకు పోయి, "పబ్లిక్ రోడ్డుమీద మీరు ఉమ్మివేయకూడదు", అని చెప్పాలి. మీరు ధరించే దుస్తులు, మీరుపయోగించే కర్చీఫ్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిత్యం స్నానము చేయాలి. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి. వారానికొకతూరిగోళ్ళను తీసివేయాలి. ఈనాటి విద్యార్థులలో చాలామంది గోళ్ళే తీయరు. అందువల్ల, ఆ గోళ్ళలో మురికి చేరిపోయి, భోజనం చేసేటప్పుడు అది కడుపులోకి ప్రవేశించి వాళ్ళను అనారోగ్యానికి గురిచేస్తుంది. అనారోగ్యానికి మూల కారణం అపరిశుభ్రతయే, అపవిత్రతయే! మీరు పరిశుద్ధంగా ఉండాలి, మీరు చదివే చదువులుకూడా పవిత్రమైనవిగా ఉండాలి. పవిత్రత, పరిశుభ్రత (Purity, Cleanliness) రెండూ చాలా అవసరం. Cleanliness is godliness. ఆధ్యాత్మిక తత్త్వమే పవిత్రతను చేకూర్చుతుంది. ఇలాంటి చదువులు చదివి మీరు తోటిమానవులకు సంతోషమునందించడానికి ప్రయత్నించాలి. ఆత్మగౌరవముతో మీరు జీవించాలి. ఈ ఆధునిక యుగంలో ఆధునిక విద్యలతోపాటు ప్రాచీన విద్యలనుకూడా మీరు అభ్యసించాలి.

**సైన్సు - ఆధ్యాత్మికము**

ఈనాడు సైన్సు అభివృద్ధి చెందింది. కాని, మానవుని senses (ఇంద్రియాలు) చాలా దిగజారిపోయాయి. సైన్సుతోపాటు 'సెన్సెస్'ను కూడా ఉన్నతస్థాయిలో పెట్టుకోవాలి. కాని, మానవుడు sensesను అధోగతి పట్టించి, scienceను అభివృద్ధి పరచుకుంటున్నాడు. సైన్సుకూడా అవసరమే! కాని, దానిని సరియైనరీతిగా వినియో గించుకొనక పెడమార్గం పట్టిస్తున్నాడు. సైన్సు అనేది ఇంగ్లీషు అక్షరం 'CÑ వంటిది. అది ఒకదగ్గర ప్రారంభమై మరొక దగ్గర నిలిచిపోతుంది. ఆది, అంతములమధ్య ఒక అగాథమైన 'లోయ' ఉన్నది. మానవుడు ఆ 'లోయ'లో పడిపోతున్నాడు. ఆధ్యాత్మికమనేది పరిపూర్ణమైనది. అది ఒక

sri sathyasai vahini vachanamrutam

circle (వృత్తము) వంటిది. అది ఎక్కడ ప్రారంభమైందో తిరిగి అక్కడికే వచ్చి నిల్చిపోతుంది. దీనిని పురస్క రించుకొనియే వేదము చెప్పింది –

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

అదే పూర్ణము. అదే పవిత్రము. సైన్సు what is this? (ఇది ఏమిటి?) అని తెలుసుకోవడానికి ప్రయత్నిస్తుంది. ఆధ్యాత్మికము what is that? (అది ఏమిటి?) అనేది విచారణ సల్పుతుంది. This (ఇది) అంటే దగ్గరగా ఉన్నది, That (అది) అంటే దూరంగా ఉన్నది. మన ఇంద్రియాలకు 'నియర్' (దగ్గర)గా ఉండేది సైన్సు, ఇంద్రియాలకు దూరంగా ఉండేది ఆధ్యాత్మికము. 'నియర్'గా ఉన్నది 'డియర్'గా ఉండకపోవచ్చు. దూరంగా ఉన్నది మాత్రం 'డియర్'గా ఉంటుంది. ఒక చిన్న ఉదాహరణ చూడండి. కొందరు జాంబియా, ఈస్ట్ ఆఫ్రికా మొదలైన దూరదేశాలనుండి స్వామిని చూడాలని వచ్చారు. దూరంగా ఉండడంచేత ఎంతో ప్రేమతో ఇక్కడికి రావాలని ఆత్రుత పడతారు. ప్రక్కనే ఉన్న గ్రామానికి వెళ్ళాలంటే ఈవిధమైన ఆత్రుత మీలో ఉండదు. దగ్గరగా ఉన్నదానికంటే దూరంగా ఉన్నదానిపై ఆసక్తి అధికంగా ఉంటుంది. That (అది) అనేది beyond the senses. అనగా, ఆధ్యాత్మికము ఇంద్రియాతీతమైనది. సైన్సు ఇంద్రియాధీనమైనది (Below the senses) ఇంద్రియాతీతమైన ఆధ్యాత్మికతత్త్వములో ప్రవేశించినప్పుడే మనం పవిత్రంగా జీవించగలము.

**ఇంద్రియాలకు బానిసలు కావద్దు**

ఈనాటి విద్యార్థులు ఇంద్రియాలకు బానిసలైపోతున్నారు. ఇది సరియైన విద్య కానేరదు. మానవుడు ఇంద్రియాలకు 'మాస్టర్' కావాలి. తాను ఇంద్రియాలకు అతీతంగా పోనక్కర్లేదు. వాటిగురించి చింతించకుండా ఉంటే చాలు. ఈనాటి మానవుడు తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంత వరకు ఇంద్రియవాంఛలలో మునిగితేలుతూ, అపవిత్రమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఇంద్రియాలు తన 'సర్వెంట్స్' లాంటివి. కనుక, వాటికి మానవుడు యజమానిగా వ్యవహరించాలేగాని, బానిసకాకూడదు. అవి చెప్పినట్లు

sri sathyasai vahinamrutam

తానువినకూడదు. రామాయణంలో కైకేయి తన దాసియైన మంథర మాటలకు లోబడినందువల్ల ఎన్ని కష్టాలకు గురి అయిందో మీకు తెలుసు. అందుకోసమే, 'సర్వెంట్'ను 'సర్వెంట్'గానే పెట్టుకోవాలి; 'మాస్టర్' ఎల్లప్పుడు 'మాస్టర్'గానే ఉండాలి. Master the mind, be a mastermind. అదే నిజమైన విద్యార్థిలక్షణం.

**ఆడంబరాలకోసం డబ్బును వ్యర్థం చేయవద్దు**

Simple living and high thinking - ఇదే నేను బోధించేది. విద్యార్థులు నిరాడంబరమైన జీవితాన్ని గడపాలి, ఉన్నతమైన ఆశయాల్ని కల్గియుండాలి. చదువుతోపాటు సంస్కారము కూడా ముఖ్యము. సంస్కారమనగా ఏమిటి? పవిత్రతను చేకూర్చునదే సంస్కారము. అయితే, 'సింపుల్ లైఫ్' పేరిట అపరిశుభ్రతకు అవకాశమందించకూడదు. ఎవరి పనులు వారే చేసుకోవాలి. మీకు ట్రైనింగు ఇచ్చేదంతా దీనికోసమే. మీ బట్టలను మీరే ఉతుక్కోవాలి. మీ తట్టలను మీరే కడుక్కోవాలి. మీ డ్యూటీని ఇంకొకరి తలపై వేయకూడదు. మీ డ్యూటీని మీరు చేయాలి. ఇంకొకరిని బాధ పెట్టకుండా నిరాడంబరమైన జీవితాన్ని గడపాలి. మీరు నివసించే స్థానములను, మీరు పుస్తకాలను పెట్టుకునే ప్రదేశములను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దీనికోసం ప్రత్యేకంగా 'సర్వెంట్స్' వచ్చి శుభ్రం చేయాలని ఆశించకూడదు. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి డబ్బు పంపించి మిమ్మల్ని చదివిస్తున్నారు. వాళ్ళు మీకు 'సర్వెంట్స్'నికూడా పంపవలెనా? నేను అప్పుడప్పుడు చెబుతుంటాను - "కొన్న కూర బేడ, కూలి పావలా.... ఇదియె నాగరికత ఇపుడు మనకు". కొన్న కూరకంటే దానిని మోయడానికి కూలి ఎక్కువ ఇస్తామా?! అలాంటి ఆడంబరాలకోసం డబ్బును వ్యర్థం చేయ కూడదు. Misuse of money is evil. డబ్బును దుర్వినియోగం చేయడం మహాపాపం! మీ తల్లిదండ్రులు తమ రక్తాన్ని ధారపోసి మీకోసం దుడ్డును సంపాదిస్తున్నారు. ఆ దుడ్డును వాళ్ళ 'బ్లడ్డు'గా చూసుకోవాలి. డబ్బును పొదుపుగా ఖర్చు పెట్టుకొని ఉన్నతమైన విద్యను అభ్యసించండి. ఈనాడు చాలామంది విద్యార్థులు ఏదో డిగ్రీ చేతికి వచ్చిన తక్షణమే విదేశాలకి పోవాలని ఆరాటపడుతున్నారు. విదేశాలకి పోవడానికి ఎంత ఖర్చవుతుంది! అంత ఖర్చుపెట్టుకొని అక్కడికి పోయి

srisathyasaivachanamrutam

చేస్తున్నదేమిటి? అక్కడ ఏ పని చేసినా చూసేవారు ఉండరు కదా! అందుచేత, అక్కడికి వెళ్ళిన తరువాత డబ్బు లేకపోతే చాలామంది హోటళ్ళలో ప్లేట్లు కడిగి డబ్బు సంపాదించుకుంటారు. విదేశాలకి పోయి ప్లేట్లు కడిగే బదులు మీ దేశంలోనే ఉండి మీ ఇంటిపనులెందుకు చేసుకోకూడదు? మన ఇంటిని మనమే ఊడ్చుకోవాలి. తల్లిదండ్రులకు సహాయం చేయాలి. తల్లి నడుం వంచడానికికూడా వీలుకాని స్థితిలో ఎంతో కష్టపడి ఇల్లు ఊడ్చడానికి ప్రయత్నిస్తుంటుంది. అలాంటి సమయంలో, 'అమ్మా! నీవు కూర్చో. నేను ఊడుస్తా'నంటే ఆమెకెంత ఆనందం కల్గుతుంది! ఇంట్లో తల్లిదండ్రులకు ఆనందమివ్వాలి, స్కూల్లో టీచర్లపట్ల వినయ విధేయతలతో మీరు ప్రవర్తించాలి.

విద్యార్థులారా! విద్యకు వినయమే భూషణమనే సత్యాన్ని మీరు గుర్తించండి. అప్పుడే మీరు ఆదర్శవిద్యార్థులుగా రూపొంది దేశానికి ఎంతైనా ఉపకారం చేయడానికి వీలౌతుంది. ఎక్కడేగాని హింసాత్మక చర్యలు జరిగితే వాటిలో ప్రవేశించకండి. అక్కడికి వెళితే మీకుకూడా దెబ్బలు తగులుతాయి. మీకు సాధ్యమైతే హింసను అరికట్టడానికి ప్రయత్నించండి. అల్లర్లకు, అలజడికి అవకాశమివ్వకుండా శాంతిని అభివృద్ధిపరచడానికి తగిన కృషి చేయండి. మీరెంతో తెలివితేటలు గలవారే! అయితే, తెలివితేటలతోపాటు శీలసంపత్తినికూడా పెంచుకోవాలి. మీరు చెలిమి, బలిమి, కలిమి – ఈ మూడింటినీ పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కాని, గుణమే లేకపోతే ఇదంతా నిరుపయోగమే కదా! గుణమునుకూడా మీరు అభివృద్ధిపరచుకొని, ఆదర్శవంతమైన విద్యార్థులుగా రూపొంది, లోకానికి "సత్యసాయి ఎడ్యుకేర్"ను చక్కగా ప్రబోధించి, సత్కీర్తిని సాధించాలి.

*(2002 నవంబరు 20వ తేదీ ఉదయం సాయికుల్వంత్ సభామండపంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)*

sri sathyasai vachanamrutam